నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | బుధవారం 9 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మద్యపానం నిషేధిస్తున్నాం

ఎల్కపల్లి(బీ)లో గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న ఎల్కపల్లి(బీ) గ్రామస్తులు

బెజ్జూర్, అక్టోబర్ 8 : 'ఇక నుంచి ఊరిలో మద్యపానం నిషేధిస్తున్నాం. ఎవ్వరూ అమ్మరాదు.. కొనరాదు.. తాగరాదు..' అంటూ ఎల్కపల్లి(బీ) గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మద్యం, గుడుంబా తాగడం వల్ల అనేక మంది రోగాల బారిన పడి మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని గ్రామస్తులు తెలిపారు. మద్యపాన నిషేధానికి సహకరించాలని ఎస్ఐ విక్రం కు వినతి పత్రం అందచేశారు.



వైశ్యభవనంలో కరెన్సీ నోట్లతో దర్శనమిస్తున్న అమ్మవారు

కరెన్సీ అమ్మవారు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 8 : పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో ఉత్సవ కమిటీ సభ్యులు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో దర్శనమివ్వగా, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రూ.25,55,555ల నోట్లతో దుర్గామాతను అలంకరించడం ఆకట్టుకున్నది.

బైపాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ భూమిలో పోసిన ఇటుక పెల్లలు, మట్టి

- మంత్రివర్గ స్థాయిలో నిర్ణయం రాకుండానే కూల్చివేతలెట్లా అని ప్రశ్నిస్తున్న ప్రజలు
- ప్రైవేట్ భూముల్లోకి ఇటుక పెల్లలు, మట్టి తరలింపు
- ఉన్నతాధికారుల మౌనం వెనుక మతలబేమిటో!

ఎన్‌వోసీ లేకుండా ఎట్లా కూల్చినట్లు?

అనుమతుల్లేకుండా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నేలమట్టంపై విమర్శలు

మంచిర్యాల, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను కూల్చివేసేందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలిసింది. సెప్టెంబర్ 23న ఐబీ చౌరస్తాలోని నాలుగున్నర ఎకరాలను మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. కానీ ఇక్కడే హాస్పిటల్ కట్టాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అసలు హాస్పిటల్ నిర్మాణం ఇక్కడేనా.. కాదా.. అన్న విషయంలో స్పష్టత రాకముందే మార్కెట్‌ను కూల్చేశారు. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల నుంచి ఎన్‌వోసీ తీసుకున్నాకే ఇక్కడున్న నిర్మాణాల కూల్చివేతలు చేపట్టాలి. కానీ అలాంటి చర్యలేవీ తీసుకోకుండానే కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆస్తిని నేలమట్టం చేశారు. ఈ విషయమై జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు, మున్సిపల్ అధికారులను అడిగితే ఆ భూమిని మెడికల్ అండ్ హెల్త్ వారికి అప్పిగించాం. కూల్చివేతలకు.. మాకు ఎలాంటి సంబంధం లేదని దాటవేసే సమాధానాలు చెబుతున్నారు.

మెడికల్ అండ్ హెల్త్‌కే క్లారిటీ లేదు..

జిల్లా ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారుల లెక్క ప్రకారం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లకు ఏమైనా తెలుసా అంటే.. అసలు కూల్చివేతలకు పర్మిషన్లే రాలేదని ఆ అధికారులే చెబుతున్నారు. భూమిని అప్పగించినట్లు వచ్చిన లేఖల ఆధారంగా మెడికల్ అండ్ హెల్త్ ఉన్నతాధికారులకు ఈ భూమిలో ప్రస్తుతం ఉన్న బిల్డింగ్‌లను కూల్చేందుకు పర్మిషన్ కావాలని దరఖాస్తు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వ అధికారులతో ఓ కమిటీని సైతం ఏర్పాటు చేశామంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చాక పబ్లిక్ నోటిఫికేషన్ ఇచ్చి కూల్చేందుకు టెండర్లు పిలవాలని అనుకున్నామని.. ఈ లోగా తమకు సంబంధం లేకుండానే బిల్డింగ్‌లను కూల్చివేశారని పేర్కొంటున్నారు. మరి ఇది ఇల్లీగల్ కాదా.. సార్ అంటే అవును. కానీ కూల్చేది ఎవరు. ఎవరిని అడగాలి. అడిగేందుకు మాకే ఏం అధికారం ఉంది.. మాకే అర్థం కావడం లేదన్నారు. వాళ్లు భూమి ఇస్తున్న లెటర్లు మాత్రమే ఇచ్చారు. దానిపై రాష్ట్ర స్థాయిలో మంత్రివర్గంలో చర్చ జరగాల్సి ఉంది. ఒక్క మంత్రి తీసుకునే నిర్ణయం కాదు. అర్ అండ్‌బీ, మున్సిపల్, మెడికల్ అండ్ హెల్త్ ఈ మంత్రిత్వ శాఖలన్నీ కలిసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అక్కడ కూల్చివేయాలని నిర్ణయం వచ్చాక.. అది జీవో రూపంలో మా చేతికి వచ్చాకే కూల్చివేతలు చేయాల్సి ఉండే. కానీ ఇక్కడ మాత్రం నేరుగా కూల్చేస్తున్నారు. ఆ కూల్చివేతలకు, కూల్చివేసిన ఇటుక పెల్లలు, మట్టి తరలింపునకు మాకు ఎలాంటి సంబంధం లేదు.. అని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు చెబుతున్నారు.

జిల్లా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్లు..

ఎలాంటి అనుమతుల్లేకుండా బిల్డింగ్ కూల్చివేస్తుంటే అడ్డుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నట్లు అన్నది అర్థం కావడం లేదు. మంత్రివర్గ స్థాయిలో కూల్చివేతలు, కొత్త హాస్పిటల్ నిర్మాణంపై నిర్ణయం రావాల్సి ఉండగానే ఎమ్మెల్యే పీఎస్సార్ ఇష్టాను సారం కూల్చివేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇవేవీ జిల్లా ఉన్నతాధికారులకు తెలియవా అంటూ మండిపడుతున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మంత్రివర్గం అనేది పీఎస్సార్‌కు అతీతమా.. ఆ స్థాయిలో నిర్ణయాలు తీసుకునే అధికారం ఎమ్మెల్యేకు ఎక్కడిది అనే చర్చ ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది. కాగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేతకు సంబంధించిన ఇటుక పెల్లలు, మట్టిని మంగళవారం మంచిర్యాల బైపాస్ రోడ్డులోని ఓ వెంచర్‌లోకి తరలించారు. పర్మిషన్ లేకుండా కూల్చడమే తప్పు అంటే ఆ కూల్చివేతకు సంబంధించిన మట్టి, ఇటుక పెల్లలను ప్రైవేట్ భూముల్లోకి తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై వివరణ అడిగేందుకే ఏ అధికారిని సంప్రదించినా మాకేం సంబంధం లేదన్నదే సమాధానంగా చెబుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఇలాంటి పనులకు కొమ్ముకాయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజల కోసం కట్టిన భవనాలను

కూల్చేస్తారా?

- ఇది ముమ్మాటికీ దుర్మార్గమైన చర్యే
- మంచిర్యాల పట్టణంపై ఎందుకంత పగ
- మార్కెట్ కమిటీ స్థలంలోనే అన్ని హాస్పిటళ్లు ఏర్పాటు చేయొచ్చు కదా
- ఇప్పుడు నిర్మించే శ్మశాన వాటికలోకి వరద రాదా ?
- అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లుంటే మంచిర్యాలలో అవసరం లేదా ?
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- ఎమ్మెల్యే పీఎస్సార్ తీరుపై ఫైర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్ , అక్టోబర్ 8 : ''ప్రజల అవసరాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి కట్టిన భవనాలను కూల్చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గమైన చర్యే. పీఎస్సార్ ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి మంచిర్యాల పట్టణంపై పగబట్టినట్లే వ్యవహరిస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. ప్రజలంతా ఓటు వేస్తేనే ఎమ్మెల్యే అయ్యావు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి'' అని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఐబీ గెస్ట్‌హౌస్ భవనాలను కూలగొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హాస్పిటల్ కట్టడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఐబీలోనే కట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికే ఆ స్థలంలో రూ. మూడు కోట్లు వెచ్చించి నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఎందుకు కూలగొట్టాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయితే, అది ఇక్కడ ఐబీ సెంటర్‌లో కళకళలాడితే దివాకర్‌రావుకు ఎక్కడ పేరు వస్తుందోనని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మార్కెట్ కమిటీ స్థలంలో ఇప్పటికే 450 పడకల హాస్పిటల్‌ను నిర్మించడం జరుగుతుందని, అక్కడ సూపర్ స్పెషాలిటీ, మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించడానికి కావాల్సినంత స్థలం ఉందని చెప్పారు. అన్ని దవాఖానలు ఒకేచోట ఉండటం వల్ల ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. మంచిర్యాలలో ఇప్పుడున్న కూరగాయల మార్కెట్ చాలా చిన్నదిగా ఉందని, ప్రస్తుత జనాభాకు అది సరిపోవడం లేదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చడం సరికాదన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లుంటే.. మంచిర్యాలలో ఎందుకు అవసరం లేదో చెప్పాలని కోరారు. ఎమ్మెల్యేగా పీఎస్సార్ గెలిచాక అంతర్గాం బ్రిడ్జి వద్దంటున్నాడని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్దంటున్నాడన్నారు. రూ. 2.20 కోట్లతో పూర్తి చేసిన గెస్ట్ హౌస్‌ను సైతం కూలగొట్టాలని చూస్తున్నారని తెలిపారు. మంచిర్యాలలో ఏ వీఐపీ వచ్చినా, ఏ అధికారి వచ్చినా ఐబీ గెస్ట్‌హౌస్‌లోనే బస చేస్తారని, గతంలో పీఎస్సార్ వందలసార్లు ఇదేగెస్ట్ హౌస్‌లో ఉన్న సంగతి మరచిపోయాడా అని ప్రశ్నించారు. మరి ఇప్పుడు ఐబీ గెస్ట్‌హౌస్ కూల్చితే ఎక్కడ కడుతారో ప్రజలకు చెప్పాల్సిన అవసరముందన్నారు. తాము నిర్మించాలని చూసిన శ్మశాన వాటిక నీట మునుగుతుందని అన్నారని, మరి ఇప్పుడు మీరు శంకుస్థాపను చేసిన స్థలం నీట మునిగేది కాదా అని ప్రశ్నించారు. మునగకుండా కరకట్టలు కడుతామని చెబుతున్నారని, అలాంటప్పుడు ఎంసీహెచ్ కూడా మునగకుండా ఉండదా అని ప్రశ్నించారు. నీట మునిగే భూమిలో, భూదాన్ భూమిలో శ్మశాన వాటిక కడుతున్నారంటే ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని, మంచిర్యాల ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని శ్మశాన వాటిక కట్టాలని కోరారు. మార్కెట్ ఏరియాలో దౌర్జన్యంగా అక్రమ కట్టడాలను కూల్చేశారని, దసరా పండుగ సమయంలో వ్యాపారులకు సమయం ఇవ్వకుండా రాత్రి 11 గంటలకు మార్కింగ్ చేసి.. ఉదయం 7 గంటలకే కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. మంచిర్యాల-అంతర్గాం గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అగ్రిమెంట్ అయ్యిందని, దీనిని రద్దు చేయమంటున్నారని, ఇక్కడ బ్రిడ్జి నిర్మించడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ యూత్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు , నాయకులు గాదెసత్యం, అంకం నరేశ్, గోగుల రవీందర్‌రెడ్డి, సాగి వెంకటేశ్వరరావు, ఎర్రం తిరుపతి, తోట తిరుపతి, సుంకరి రమేశ్, తాజుద్దీన్, శ్రీరాముల మల్లేశ్, పడాల రవీందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- జిల్లాలో 59,212 ఎకరాల్లో వరి సాగు
- మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశం
- జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల ఏర్పాటు
- సన్న, దొడ్డు రకాల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ) : ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. జిల్లాలో 59,212 ఎకరాల్లో వరి సాగవుతుండగా, మరో నెల రోజుల్లో పంట చేతికందే అవకాశమున్నది. ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టనుండగా, అందుకనుగుణంగా కేంద్రాలను సిద్ధం చేస్తున్నది.

వేర్వేరుగా సేకరణ

59,212 ఎకరాల్లో వరిసాగవుతుండగా, దాదాపు 5 వేల నుంచి 7 వేల ఎకరాల్లో సన్న రకాల ధాన్యం సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. 90 శాతం మంది రైతులు సాధారణ రకాల వడ్లనే సాగుచేస్తున్నారు. కొద్ది మంది మాత్రమే తమ ఇంటి అవసరాలకు కావాల్సిన సన్న రకాలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకాలకు క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకాలకు రూ. 2,300 మద్దతు ధర చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్‌ను అదనంగా అందించనున్నది. సన్నరకాలు, సాధారణ రకాలను వేర్వేరుగా సేకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 34 కొనుగోలు కేంద్రాల్లో 10 నుంచి 12 కేంద్రాలను ప్రత్యేకంగా సన్నరకాల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయనున్నారు.

కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష

ధాన్యం సేకరణపై ఇటీవల కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సన్నరకాలకు రూ. 500 బోనస్ ఇస్తున్న క్రమంలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి ధాన్యం తీసుకొచ్చి విక్రయించే అవకాశమున్నందున సరిహద్దులో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేం ద్రాల వద్ద రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వందేభారత్‌కు హాల్టింగ్ ఇవ్వాలి

- బోగీల సంఖ్య తగ్గించవద్దు
- బీఆర్ఎస్ డిమాండ్
- మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన, మేనేజర్‌కు వినతి

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 8: నాగ్‌పూర్-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని, బోగీల సంఖ్యను 20 నుంచి 10కి తగ్గించాలనుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు మాట్లాడుతూ వందేభారత్‌కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వడం వల్ల రైల్వేకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నా రు. సికింద్రాబాద్, నాగ్‌పూర్‌ల మధ్య అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే రైల్వే స్టేషన్ మంచిర్యాల అని కొనియాడారు. ఒక్క మంచిర్యాల నుంచే ఈ రైలులో నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగించే వీలుందని, ఈ విషయాన్ని రైల్వే అధికారులు పరిశీలించాలని కోరారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన రైలు అయితే హాల్టింగ్ ఇవ్వడం కష్టంగా ఉండేదని, దగ్గరిదగ్గరి స్టేషన్ల మధ్య నడిచే ఈ రైలు విషయంలో నిబంధనలు సడలించుకోవాలన్నారు. నాయకులు గాదె సత్యం, అంకం నరేశ్, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, తిరుపతి, తిరుపతి, రమేశ్, తాజుద్దీన్, శ్రీరాముల మల్లేశ్, పడాల రవీందర్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం

అందేలా చూడాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్,అక్టోబర్ 8 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ శ్రీనివాసరావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవితో కలిసి జిల్లా అధికారులు, విజిలెన్స్ కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో సమగ్ర విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలోడీపీఆర్వో సంప త్‌కుమార్, డీపీఏ హెచ్‌వో సురేశ్‌కుమార్, విజిలెన్స్ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, గణేశ్, అశోక్, గోపాల్ నాయక్, సిడాం అర్జున్, గంగుబాయి పాల్గొన్నారు.

పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా..

- చెన్నూర్ పట్టణంలో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- ఆడిపాడిన మహిళలు
- పెద్ద చెరువులో నిమజ్జనం

శివాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 8 : చెన్నూర్ పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాలయం, పద్మశాలీ భవన్, చోటాహనుమాన్ వీధి, లక్ష్మీదేవర ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లో మహిళలు, యువతులు వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన చౌరస్తాల్లో పెట్టి ఆడిపాడారు. డీజే పాటలపై నృత్యాలు చేశారు. కోలాటాలతో సందడి చేశారు. అనంతరం భాజాభజంత్రీల నడుమ బతుకమ్మలను పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. పోయిరా.. బతుకమ్మ పోయిరావమ్మా.. అంటూ గౌరమ్మకు వీడ్కోలు పలికారు.

ఓటరు జాబితా రూపకల్పన

సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, అక్టోబరు 8 : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు కుమార్‌దీపక్, వెంకటేశ్ ధోత్రే,అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న మొదటి రిపబ్లికేషన్, 25న 2వ రిపబ్లికేషన్ చేయడం జరుగుతుందని, నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబరు 25న ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిశీలించి 30న తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు.